ఎక్కడా.. ఏ చిన్న తప్పిదం జరగొద్దు

- వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ
- నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్, మార్చి 22 : నోడల్ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని..అన్ని అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ సూచించారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా.. ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం ఇవ్వకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్, మ్యాన్‌పవర్ తదితర వాటిని ఏర్పాటు చేసుకోవాలని.. ఫ్లయింగ్, ఎస్ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలను పూర్తి స్థాయిలో పనిచేసేలా చూడాలన్నారు. నిఘా బృందాలు తమకు కేటాయించిన ప్రదేశాల్లో విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. సువిధ యాప్ ద్వారా అనుమతులు జారీ చేయాలన్నారు. పోలింగ్‌స్టేషన్లు, రూట్ మ్యాపు చూసుకోవాలని, బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రాల్లోని ఓటరు జాబితాను సరిచూసుకోవాలన్నారు. 85 ఏండ్లు పైబడిన వారికి, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు ఉండడంతో ఫారం -12డీలను అర్హులకు అందించాలన్నారు. పౌరులకు ఎన్నికలపై సందేహాలుంటే 1950 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చునన్నారు. అక్రమంగా డబ్బు, మద్యం సరఫరా, ప్రలోభాలు, బహుమతులు ఇవ్వడం వంటి వాటిని పకడ్బందీగా నియంత్రించాలని ఆదేశించారు. సీ-విజిల్ యాప్ ద్వారా కానీ 1950 టోల్ ఫ్రీ లేదా కంట్రోల్ రూంకు ఫిర్యాదులొస్తే 15 నిమిషాల్లోనే ఘటనాస్థలికి చేరుకోవాలన్నారు. ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలన్నారు. రాజకీయ ప్రకటనలకు సంబంధించి మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ తదితర వాటిని సంబంధిత అధికారి చూడాలన్నారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జాకీర్‌అహ్మద్, తహసీల్దార్లు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేరినాట్ ఉన్నత పాఠశాల పరిశీలన

పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జిల్లాలోని వికారాబాద్ నియోజకవర్గానికి కేటాయించిన ఈవీఎంలను భద్రపరిచేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. శుక్రవారం వికారాబాద్ నియోజకవర్గానికి సంబంధించి డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు మేరినాట్ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని .. స్కూల్ పరిధిలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రంగా ఉంచాలన్నారు.

ఆలయంలో కొలువుదీరిన ఉత్సవమూర్తులు

ఏప్రిల్ 2 నుంచి కొడంగల్ వేంకటేశ్వరుడి

బ్రహ్మోత్సవాలు

- తొమ్మిది రోజులపాటు జరుగనున్న ప్రత్యేక కార్యక్రమాలు
- ఏర్పాట్లకు సన్నద్ధమవుతున్న ఆలయ నిర్వాహకులు

శ్రీవారి ఆలయం

కొడంగల్, మార్చి 22 : కొడంగల్ శ్రీమహాలక్ష్మీవేంకటేశ్వరుడి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్నది. తిరుమల తిరుపతి దేవస్థానంలో అనుసరించే పూజా విధానాన్నే ఇక్కడ పాటించడం ఈ ఆలయం ప్రత్యేకత. అర్చకులు విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి వైఖానస ఆగమన పద్ధతినే పాటిస్తూ కైంకార్యాలను నిర్వహిస్తున్నారు. ఈ ఆలయ ప్రధాన అర్చకుడిగా కొనసాగిన ఎన్ఏకే సుందరవరద భట్టాచార్యులు తిరుమల తిరుపతి దేవస్థానంలో వైఖానుసాగమ సలహాదారుడిగా గౌరవాన్ని పొందారు. ఆయన నేతృత్వంలో గత 40 ఏండ్లుగా బ్రహ్మోత్సవాలు కొనసాగుతూ వచ్చాయి. ప్రస్తుతం ఆయన పరమపదించడంతో వారి కుటుంబసభ్యులు స్వామి వారికి నిత్యసేవలు, బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రతిఏటా ఫాల్గుణమాసంలో తొమ్మిది రోజులపాటు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలు సాక్షాత్తు తిరుమల తిరుపతిలో ఆ తరుమలేశుడికి నిత్యపూజలు నిర్వహించే అర్చకుల నేతృత్వంలో జరుగడం ఇక్కడి ప్రధాన ప్రత్యేకత. వచ్చేనెల 2వ తేదీన స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

ఏప్రిల్‌లో జరిగే బ్రహ్మోత్సవాల్లో రోజువారీ కార్యక్రమాలివే..

రెండో తేదీన తిరుమంజనం, మూడున సేనాధిపతి ఉత్సవం, నాలుగున ధ్వజారోహణం, ఐదోతేదీన చిన్న శేషవాహనం, ఆరోతేదీన సింహవాహనం, ఏడోతేదీన కల్పవృక్ష వాహనం, సర్వభూమపాల వాహనం, ఎనిమిదో తేదీన మోహినీ అవతారం, గరుడోత్సవం (లంకాదహనం) తొమ్మిదో తేదీన హనుమంత వాహనం, వసంతోత్సవం, పదోతేదీన సూర్యప్రభ వాహనం, 11న రథోత్సవం, 12 పల్లకి ఉత్సవం, చక్రస్నానం, ధ్వజారోహణం

పెద్దచెరువులోని అక్రమ నిర్మాణాలను జేసీబీతో కూల్చివేయిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు

కొనసాగుతున్న కూల్చివేతలు

ఇబ్రహీంపట్నం, మార్చి 22 : నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాలతోపాటు చెరువుల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారుల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 1137, 1238 సర్వేనంబర్లలోని పెద్దచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మించిన కట్టడాలను అధికారులు జేసీబీతో కూల్చివేయించారు. అలాగే, ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనంబర్ 37లోని జిలాన్‌కాన్‌చెరువు ఎఫ్‌టీఎల్‌లోని కట్టడాలను అధికారులు తొలగించారు. చెరువులు, కుంటల్లో కట్టడాలను నిర్మిస్తే కూల్చివేస్తామని ఇరిగేషన్ డీఈ ఉష తెలిపారు. ఈ కూల్చివేతల్లో తహసీల్దార్ సునీత, ఆర్ఐ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

టీఆర్టీ(డీఎస్సీ) ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ జిల్లా నిరుద్యోగ ఎస్సీ అభ్యర్థులకు రెండు నెలలపాటు ఉచితంగా రెసిడెన్షియల్‌తో కూడిన టీఆర్టీ(డీఎస్సీ) శిక్షణ ఇస్తామని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ కోసం డీఈడీ(టీటీసీ), బీఈడీ, టెట్ ఉత్తీర్ణులై డీఎస్సీ-2024కు దరఖాస్తు చేసుకున్న హైదరాబాద్ జిల్లాకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించకూడదని తెలిపారు. ఇతర కోర్సులు అభ్యసిస్తున్న వారు, గతంలో ఉచిత శిక్షణ పొందిన వారు అనర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 25 లోపున tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధికి..

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువు కోసం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులు ఈ నెల 31 వరకు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. యూఎస్ఏ, కెనడా, జర్మనీ, యూకే, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల్లో చదువుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. కుటుంబ ఆదాయం రూ.5 లక్షలు మించకూడదని చెప్పారు. దీని కింద అందే సాయం రూ.20 లక్షల వరకు ఉంటుందని, ఓ కుటుంబం నుంచి ఒకరికి మాత్రమే వర్తిస్తుందన్నారు. గ్రాడ్యుయేషన్‌లో 60 శాతం, జీఆర్ఈ/జీఎంఏటీ, ఇంగ్లిష్ ప్రావీణ్యత పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులు telanganaepass.cgg.giv.inలో పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు.

స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులను ప్రారంభిస్తాం

తెలుగు యూనివర్సిటీ, మార్చి 22 : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి కేంద్రంలో త్వరలో సమకాలీన కళా ప్రక్రియలకు ఆధునీకతను జోడించి యువతకు స్వయంఉపాధి అవకాశాలు కల్పించేలా కోర్సులు ప్రారంభిస్తున్నట్లు వీసీ ఆచార్య కిషన్‌రావు వెల్లడించారు. తెలుగు వర్సిటీ డిజైన్ విభాగం విద్యార్థులు శుక్రవారం నిర్వహించిన వస్తుప్రదర్శనశాలను వీసీ కిషన్‌రావు ప్రారంభించారు. తక్కువ రుసుముతో వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతరించిపోతున్న సంప్రదాయ కళలను విద్యార్థులకు నేర్పించడం ద్వారా స్వయంఉపాధి కల్పించొచ్చన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ పాల్గొన్నారు.

యాసిన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ సీజ్

- ఎలాంటి అర్హతలు.. అనుమతుల్లేకుండా నిర్వహణ
- విచారించిన డిప్యూటీ డీఎంహెచ్‌వోలు.. క్లినిక్‌కు తాళం

యాసిన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వోలు

పరిగి, మార్చి 22 : దోమ మండలంలోని ఊట్‌పల్లి గ్రామానికి చెందిన బంటు శ్రీనివాస్ మృతికి గల కారణాలపై శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వోలు వైద్యులు జీవరాజ్, రవీంద్ర, డిప్యూటీ డెమో శ్రీనివాస్ విచారణ జరిపి ఆర్ఎంపీ గఫార్ నిర్వహిస్తున్న యాసిన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను సీజ్ చేశారు. బంటు శ్రీనివాస్ మృతికి కారణమైన ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలని పలువురు జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు గఫార్ నిర్వహిస్తున్న యాసిన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను వారు పరిశీలించారు. క్లినిక్ నిర్వహణకు, అల్లోపతి వైద్యం చేసేందుకు ఎలాంటి అర్హతలు, అనుమతులు లేవని నిర్ధారించారు. ఇక నుంచి క్లినిక్ నిర్వహించొద్దని హెచ్చరించడంతోపాటు సీజ్ చేశారు. విచారణ నివేదికను డైరెక్టర్ ఆఫ్ హెల్త్, జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు.

పన్ను వసూళ్లు ముమ్మరం

షాపులను సీజ్‌చేసిన మున్సిపల్ అధికారులు

ఇబ్రహీంపట్నం, మార్చి 22 : ఆస్తిపన్ను వసూలుకు గడువు ముంచుకొస్తున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు వసూళ్లను ముమ్మరం చేశారు. బకాయిలు చెల్లించని పలు దుకాణాలను శుక్రవారం సీజ్ చేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో రూ.6.30కోట్ల ఆస్తి పన్ను బకాయిలున్నాయి. ఈ నెలాఖరు వరకే గడువు ఉండడంతో అధికారులు శుక్రవారం పలు దుకాణాలతోపాటు రెవెన్యూ ఉద్యోగుల పౌర సముదాయానికి కూడా తాళాలు వేశారు. దీంతో రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తక్షణమే రూ.2 లక్షల బకాయిలు చెల్లించారు. అలాగే, దుకాణాలు సీజ్‌చేసిన వ్యాపారస్తులు కూడా ముందుకొచ్చి బకాయిలు చెల్లించారు. ఈ నెలాఖరులోగా బకాయిలు చెల్లించకపోతే షాపులను సీజ్‌చేస్తామని కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు.

మున్సిపల్ అధికారులు సీజ్ చేసిన షాపు

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

కులకచర్ల బాలుర జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర

వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర

కులకచర్ల, మార్చి 22 : పోలింగ్ కేంద్రాల్లో వసతులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర అన్నారు. శుక్రవారం ఆయన కులకచర్ల తహసీల్దార్ కార్యాలయానికెళ్లి.. అక్కడి నుంచి కులకచర్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఏర్పాటు చేయనున్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రాలు ఉండాలన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలని.. విధుల నిర్వహణలో అలసత్వం చేసే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కులకచర్ల తహసీల్దార్ మురళీధర్, డిప్యూ టీ తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఎంపీవో కరీమ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రవీందర్ పాల్గొన్నారు.

భూసమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

దోమ, మార్చి 22 : భూసమస్యలను సామరస్యంగా లేదా కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలి తప్ప ఎలాంటి దాడులకు పాల్పడొద్దని ఆర్డీవో వాసుచంద్ర అన్నారు. మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్-50లో భూవివాదమై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆయన తహసీల్దార్ పురుషోత్తంతో కలిసి క్షేత్రస్థాయికి వెళ్లి భూమిని పరిశీలించారు. ఆ గ్రామానికే చెందిన చీమె రాములమ్మ అనే మహిళా రైతుకు సర్వేనంబర్ 43, 50లలో భూమి ఉన్నది. సర్వేనంబర్ 50/ఎ/1లో 1-09 గుంటల భూమిని 2018 లో అయ్యూబ్ అనే వ్యక్తికి విక్రయించింది. ఒక భూమిని చూపి మరొక భూమిని పట్టా చేసి ఇచ్చావని కొన్నేండ్లుగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరుగుతున్నది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో తహసీ ల్దార్, ఆర్ఐ సుదర్శన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శ్రీనివాస్

ఎస్‌హెచ్‌జీలు ఆర్థికంగా ఎదగాలి

డీఆర్‌డీవో శ్రీనివాస్

మర్పల్లి, మార్చి 22 : స్వయం సహాయక సంఘాల సభ్యులు (ఎస్‌హెచ్‌జీ) ఆర్థికంగా ఎదగాలని వికారాబాద్ డీఆర్‌డీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు పాఠశాల, కళాశాలల విద్యార్థులకు యూనిఫామ్ కుట్టి సరఫరా చేసేందుకు కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో చిన్న, చిన్న వ్యాపారాలు చేస్తూ తమ ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. అంతకుముందు ఆయన మండలంలోని మల్లికార్జునగిరి గ్రామాన్ని సందర్శించి ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజమల్లయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు జగదాంబ, ఏపీఎం మధుకర్, మాజీ అధ్యక్షురాలు ఇందిర, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అసైన్డ్ భూమిలో సూచిక బోర్డును ఏర్పాటు చేస్తున్న అధికారులు

ప్రభుత్వ భూమి స్వాధీనం

మొయినాబాద్, మార్చి 22 : ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని బోర్డును ఏర్పాటు చేశారు. మండలంలోని కనకమామిడి గ్రామ రెవెన్యూలోని సర్వేనంబర్ 51/4లో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన పేదలు తొంట అంతయ్య, తొంట నారాయణ, తొంట యాదమ్మ, తొంట జంగయ్యలకు పంపిణీ చేశారు. అయితే వారు సాగు చేసుకుని జీవించాల్సి ఉండగా.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్ నగరానికి చెందిన కొంతమందికి ఆ నాలుగు ఎకరాల భూమిని విక్రయించారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించి అసైన్డ్ భూమిగా నిర్ధారించి వారికి నోటీసులు జారీ చేశారు. తహసీల్దార్ గౌతమ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ చంద్రమోహన్ స్థానికుల సమక్షంలో పంచనామా నిర్వహించి పీవోటీ చట్టం 1977 ప్రకారం నాలుగు ఎకరాల అసైన్డ్ భూమిని స్వాధీనం చేసుకుని.. అందులో ప్రభుత్వ సూచిక బోర్డును శుక్రవారం ఏర్పాటు చేశారు. అసైన్డ్ భూమిని అమ్మినా..కొన్నా చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. వారి వెంట రెవెన్యూ సిబ్బంది భాస్కర్, మహేందర్ ఉన్నారు.

కవులు ప్రజలను చైతన్యవంతం చేయాలి

చిక్కడపల్లి, మార్చి 22 : కవులు తమ కవితల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాలని పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ పిలుపునిచ్చారు. ప్రపంచ కవిత దినోత్సవం సందర్భంగా భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్, విమలా సాహితీ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీక్రాస్ రోడ్స్‌లోని కళాభారతి సిటీ కల్చరల్ సెంటర్‌లో ప్రముఖ కవి డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది. డాక్టర్ రాజ్‌గోపాల్ రచించిన 'అక్షరాలు అవే ..భావాలు ఎన్నో ' కవితా సంపుటిపై అతిథులు మాట్లాడారు. అనంతరం కవులను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు డాక్టర్ నాళేశ్వరం శంకరం, జెల్దీ విద్యాధర్, రాజావాసిరెడ్డి మల్లీశ్వరి, శ్రీనివాస్‌గౌడ్, దామోదరాచారి పాల్గొన్నారు.

రక్తదానం చేసిన పోలీసులు

అంబేద్కర్ భవనంలో శుక్రవారం సబ్‌డివిజన్ పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరానికి వికారాబాద్ అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, యువకులు, పోలీసులు పాల్గొని 158 యూనిట్ల రక్తదానం చేశారు. కార్యక్రమంలో వికారాబాద్ సబ్‌డివిజన్‌లోని ధారూరు, మోమిన్‌పేట, వికారాబాద్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, ఆంజనేయులు, నాగరాజు, వికారాబాద్ సబ్ డివిజన్‌లోని నవాబుపేట, మోమిన్‌పేట, మర్పల్లి, బంట్వారం, ధారూరు, వికారాబాద్ పీఎస్‌ల ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. -వికారాబాద్, మార్చి 22

రసరంజని నాటకోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

తెలుగు యూనివర్సిటీ, మార్చి 22 : తెలుగు నాటక రంగ వికాసానికి మూడు దశాబ్దాలుగా తోడ్పాటును అందిస్తున్న రసరంజని 31వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఐఏఎస్ అధికారి, రసరంజని అధ్యక్షుడు డాక్టర్ కేవీ.రమణాచారి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవీంద్రభారతి ప్రధాన ఆడిటోరియంలో 25, 26, 27తేదీల్లో నిర్వహించనున్న రసరంజని నాటకోత్సవాల బ్రోచర్‌ను రమణాచారి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఇటీవల తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాన్ని అందుకున్న రసరంజని కోశాధికారి మోహన్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రసరంజని కార్యదర్శి కామేశ్వరరావు, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

కాసాని గెలుపునకు కృషి చేయాలి

కందుకూరు, మార్చి 22: బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ నెల 24 (ఆదివారం) జిల్లెలగూడలోని యాదిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామం నుంచి బీఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని సక్సెస్ చేయాలన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. చేవెళ్ల గడ్డపై మూడోసారి గులాబీ జెండాను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్ దేవేందర్, పర్వతాల్‌యాదవ్, మాజీ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, డైరెక్టర్ ఆనంద్, శేఖర్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కార్తిక్, దీక్షిత్‌రెడ్డి, రామకృష్ణ ముదిరాజ్, వెంకటేశ్, కృష్ణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సామయ్య, లక్ష్మణాచారి, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు